మహిళాభ్యున్నతికి ప్రభుత్వం కృషి



ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న నందిని మల్లు

రసూల్‌పురా: కంటోన్మెంట్ క్లాసిక్ గార్డెన్‌లో షాసన్ ఈవెంట్ ఆధ్వర్యంలో రెండ్రోజుల పాటు పాటు జరిగే స్టైలిష్క్ ఎగ్జిబిషన్‌ను మంగళవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి విశేషంగా కృషి చేస్తోందని అన్నారు. మార్వాడీ, జైన్ మహిళలు పేద మహిళలకు చేయూతని చ్చేందుకు గత ఐదేళ్ల నుంచి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి నిధులను సేకరిస్తుండటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ నిర్వాహకులు సంగీత బన్సల్, శిలా కనుంగో, దీపా బన్సల్, అన్నూషా లుహాదియా, రుచి జైన్ పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్స్‌డే



డాక్టర్స్ డేలో పాల్గొన్న వైద్యుల బృందం

సనత్‌నగర్: జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలను జెక్‌కాలనీలోని పార్థివ్ లంగ్‌కేర్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. సెంటర్ సిబ్బంది, ఆస్పత్రికి వచ్చిన రోగుల సమక్షంలో జరిగిన ఈ వేడుకల్లో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నాగరాజు, సాధారణ వైద్య చికిత్స నిపుణులు డాక్టర్ మౌనిక, డాక్టర్ ఆంజనేయులు హాజరై మాట్లాడారు. ప్రజారోగ్య సేవలో తరించేది ఒక్క డాక్టర్ మాత్రమేనని, ఆ వృత్తిలో ఉన్నందుకు తనకెంతో గర్వంగా ఉందన్నారు. నిరుపేదల ఆరోగ్యం కోసం పార్థివ్ లంగ్‌కేర్ ఆధ్వర్యంలో తరచూ ఉచిత వైద్య శిబిరాలతో పాటు అవగాహన కార్యక్రమాలను నిర్వహించి చైతన్యం కల్పించడం జరుగుతుందన్నారు.

అర్జీలు ఎవరికివ్వాలబ్బా?

లాలాపేట: సికింద్రాబాద్ నియోజకవర్గంలో గత కొన్ని రోజుల నుంచి అధికార కాంగ్రెస్ పార్టీ నేతల పెత్తనంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రజలంతా ఏదైనా అధికారిక పని, స్థానిక సమస్యలపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పద్మారావు వద్దకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కొందరు కాంగ్రెస్ పార్టీ నేతలు ఎవైనా అర్జీలు ఉంటే తమకు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. తాజాగా బోనాల జాతర వేడుకలకు సంబంధించి ప్రభుత్వం అమ్మవారి ఆలయాలకు ఇచ్చే ఆర్థిక సహాయం కోసం దరఖాస్తులు తమకే ఇవ్వాలని లేదంటే ఆపేస్తామని కాంగ్రెస్ పార్టీ నేతలు హుకుం జారీ చేస్తున్నారని కొందరు టెంపుల్ నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. దీంతో ఇటు ఎమ్మెల్యేను సంప్రదించాలో.. లేకా అధికార పార్టీ నేతలను సంప్రదించాలో తెలియక ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. ఈ విషయమై ప్రభుత్వం, అధికారులు స్పందించి పరిస్థితిని చక్కదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.



అర్హులందరికీ ఇళ్లు

శ్రీనగర్‌కాలనీ: అర్హులైన ప్రతిఒక్కరికీ డబుల్‌బెడ్‌రూం ఇళ్లను అందిస్తామని ఖైరతాబాద్ ఎంఆర్‌ఓ నయీముద్దీన్ అన్నారు. మంగళవారం రహమత్‌నగర్ ఎస్‌పీఆర్‌హిల్స్‌లోని కమలానగర్ డబుల్‌బెడ్‌రూం ఇళ్లపై బస్తీ సభ నిర్వహించారు.

పార్కు అభివృద్ధే ధ్యేయం



మామిడి బాల్‌రెడ్డి



మహ్మద్ లాయక్ అలీ

పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మామిడి బాల్‌రెడ్డి నియమితులయ్యారు. పార్కులో జరిగిన ఎన్నికల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మూడు సంవత్సరాల పాటు నూతన కమిటీ అధికారంలో ఉంటుంది. ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ లాయక్ అలీ, ఉపాధ్యక్షుడిగా చక్రధర్ యాదవ్, కాపర్తి శ్రీనివాస్, ఎం. విజయ్‌కుమార్, జోషీలా ఎమ్మా, కార్య నిర్వహక కార్యదర్శిగా కె. మధుసూదన్‌రెడ్డి, కోశాధికారిగా కుషాల్ ఎంపికయ్యారు. అధ్యక్షులు మామిడి బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పద్మారావునగర్ పార్కు సమగ్రాభివృద్ధికి నిర్దిష్టమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతామన్నారు. రాజకీయాలకు అతీతంగా పార్కు అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానన్నారు.

నీట్ పరీక్ష విధానాన్ని రద్దు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: నీట్ పరీక్ష విధానాన్ని రద్దు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మంగళవారం డిమాండ్ చేశారు. నీట్ అక్రమాల పై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. జాతీయ స్థాయిలో కాకుండా రాష్ట్రాల వారీగా పాత పద్ధతిలో హెల్త్ యూనివర్సిటీల పర్యవేక్షణలో ప్రవేశ పరీక్షను నిర్వహించాలన్నారు. నీట్ ఫలితాలు విడుదలై 28 రోజులైన కేంద్ర ప్రభుత్వం ఇంత వరకు ఎవరి పై చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ అంధకారమైందని విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు.

దళిత ఎస్‌ఐకి రాష్ట్ర డీజీపీ అండగా ఉండాలి

ఉస్మానియా యూనివర్సిటీ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎస్‌ఐ శ్రీరాముల శ్రీనివాస్‌కు రాష్ట్ర డీజీపీ, ప్రభుత్వం అండగా ఉండాలని ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాలల పొలిటికల్ జేఏసీ చైర్మన్ డా.మంచాల లింగస్వామి డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. సీఐ జితేందర్ రెడ్డి, నలుగురు కానిస్టేబుళ్ల వేధింపులతో ఎస్‌ఐ శ్రీనివాస్ ఆత్మహత్యహత్యానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డీజీపీని కోరారు.

పదేళ్ల అనంతరం ఆలయ కమిటీలు

- కట్టమైసమ్మ కమిటీ బాధ్యతల స్వీకరణ
- త్వరలో మరిన్ని కమిటీల ఏర్పాటు
- కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం
- డీలాపడ్డ బీఆర్‌ఎస్ శ్రేణులు



నామాలగుండులోని శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం

సికింద్రాబాద్: రాష్ట్రంలో అధికార మార్పిడితో సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని ఆలయ కమిటీలకు మోక్షం లభించింది. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో నియోజకవర్గంలోని ఏ ఒక్క దేవాలయానికి కూడా ధర్మకర్తల మండలిని నియమించలేదు. ధర్మకర్తల మండలి నియామకం కోసం రెండు సార్లు దేవాదాయశాఖ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. పదవులు ఆశించిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు అప్పట్లో దరఖాస్తులు చేసుకున్నారు. ఏళ్ల తరబడి దరఖాస్తు దారులు కండ్లు కాయలు కాసేలా ఎదురుచూసినా ఆలయ పదవులు దక్కలేదు. కేవలం పాలకుల సిఫారసు లేని కారణంతో మాత్రమే దేవాదాయశాఖ అధికారులు ధర్మకర్తల నియామక ప్రక్రియ పూర్తిచేయలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో రెండు దఫాలుగా పలువురు నాయకులు కార్పొరేటర్లు కావడం మినహా మిగతా నాయకులకు ఆలయ కమిటీలు కాదు కదా పార్టీ పదవులు కూడా లభించలేదు.

కట్ట మైసమ్మతో ప్రారంభం..

చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయ కమిటీతో ధర్మకర్తల మండళ్ల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం అయింది. సికింద్రాబాద్ నుంచి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ఉన్నప్పటికీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన క్రమంలో కాంగ్రెస్ నాయకులే ధర్మకర్తలుగా నిమితులవుతున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుంటి కష్ణ చిలకలగూడ కట్టమైసమ్మ దేవాలయ చైర్మన్‌గా నియమితులయ్యారు. మూడు రోజుల క్రితం ఆయనతోపాటు పలువురిని ధర్మకర్తలుగా కాంగ్రెస్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్‌కుమార్ సమక్షంలో ఆలయ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. త్వరలో బోనాల జాతర వస్తున్న నేపథ్యంలో ముందుగా ఆలయ ధర్మకర్తల మండలిని నియమించినట్టు కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు.

త్వరలో అన్ని ఆలయాలకు..

సికింద్రాబాద్ నియోజకవర్గంలోని ఏడు ఆలయాలకు ఆలయ కమిటీలను నియమించేందుకు దేవాదాయశాఖ అధికారులు పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రెండు సార్లు నోటిఫికేషన్ జారీ చేశారు. నామాలగుండులోని వీరాంజనేయస్వామి ఆలయం, సీతాఫల్‌మండిలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం, రైల్వేస్టేషన్ సమీపంలోని శ్రీదత్తాత్రేయస్వామి ఆలయం, చిలకలగూడలోని కట్టమైసమ్మ ఆలయం, అడ్డగుట్ట డివిజన్ నార్త్‌లాలాగూడలోని పహడీ హనుమాన్ ఆలయం, లాలాపేటలోని శ్రీరామమందిరం, మెట్టుగూడలోని వీరాంజనేయస్వామి ఆలయాలకు కమిటీలను వేసేందుకు అప్పట్లో అధికారులు నోటిఫికేషన్ వేశారు. ఇందులో తాజాగా చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయ కమిటీ ఏర్పాటు ప్రక్రియ పూర్తయింది. మిగతా దేవాలయాలకు త్వరలో కమిటీల నియామనం చేసేందుకు కాంగ్రెస్ నేతలు కసరత్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ నేతల్లో ఉత్సాహం..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే సికింద్రాబాద్ కాంగ్రెస్ నాయకుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తుంది. తమ పార్టీ ఎమ్మెల్యే ఇక్కడ లేకపోయినప్పటికీ, కంటెస్టెడ్ ఎమ్మెల్యే సిఫారసుతో వారికి పదవులు లభిస్తుండడమే ఇందుకు కారణం. ఈ క్రమంలో ఇక్కడి అన్ని ఆలయాల కమిటీలకు కలిపి మొత్తంగా మరో 50మంది కాంగ్రెస్ నాయకులకు పదవులు దక్కే అవకాశం ఉంది.

టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కోఆర్డినేటర్‌గా శివకుమార్ లాల్



మధుయాష్కీ గౌడ్ నుంచి నియామక పత్రాన్ని అందుకున్న శివకుమార్ లాల్

బన్సీలాల్‌పేట్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా డాక్టర్ శివకుమార్ లాల్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర చైర్మన్ మధుయాష్కీ గౌడ్ ఆదేశాలు జారీ చేశారు. 1983 నుంచి కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులు నిర్వహించిన డాక్టర్ శివకుమార్ లాల్ రాష్ట్ర ప్రచార కమిటీ సమన్వయకర్తగా ఎంపికయ్యారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ రామస్వామి కంపౌండ్ ప్రాంతానికి చెందిన శివకుమార్ లాల్ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తుండటంతో పార్టీ రాష్ట్ర పదవికి ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుదీర్ఘకాలంగా కాంగ్రెస్‌లో పని చేస్తున్న తనకు పార్టీ గుర్తింపునిస్తూ రాష్ట్రస్థాయి పదవి ఇవ్వడం సంతోషకరమన్నారు. రానున్న కాలంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేత దిశగా తన బాధ్యతలను నిర్వర్తిస్తానన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు



సనత్‌నగర్: టమాటా రూ.41, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 35, బెండకాయ 35, పచ్చిమిర్చి 70, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 70, పచ్చకాకర 38, పందిరి బీర 28, క్యాబేజీ 35, క్యారెట్ 35, దొండ 18, గుండు బీన్స్ 95, గింజ చిక్కుడు 75, గోకరకాయ 50, కీర 18, దోసకాయ 23, బీట్‌రూట్ 27, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 38, చామగడ్డ 35, మొరంగడ్డ 40, కందగడ్డ 55, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 4-5, ముల్లంగి 5-6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

కోర్టు ఆవరణలో ఏటీఎంకు స్థలం కేటాయించాలి



బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ కోర్టుల సముదాయం ప్రాంగణంలో ఏటీఎం ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని న్యాయవాదులు కోరారు. మంగళవారం సికింద్రాబాద్ న్యాయమూర్తితో పాటు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సవంతకుమార్‌కు న్యాయవాదుల సంఘం ప్రతినిధులు భాస్కరగిరి, పిట్ల బాలశంకర్ వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోర్టు ప్రాంగణంలో బ్యాంకింగ్ సేవలు లేని కారణంతో కోర్టు ఫీజులు, బెయిల్ డిపాజిట్లకు అవసరమయ్యే డబ్బు కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు.

నిరుద్యోగ సమస్యలపై సీఎం స్పందించాలి



మాట్లాడుతున్న నాగేశ్వర్ రావు

ఉస్మానియా యూనివర్సిటీ: నిరుద్యోగ సమస్యపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాతీయ నాయకులు నాగేశ్వర్ రావు మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్ర రూపం దాల్చక ముందే పరిష్కారం కోసం ప్రణాళిక రూపొందించి జాబ్ కేలండర్ విడుదల చేయాలన్నారు. టెట్ అభ్యర్థులకు చదువుకునే సమయం లేనందున డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలన్నారు. ఈ సమావేశంలో సుమంత్, స్వాతి, రుక్మత్ పాషా, అంజి, ప్రశాంత్, సతీష్, కాంత్రి, కోటేశ్వర్, శ్రీవాణి, సౌజన్య, భవాని, రామ్ పాల్గొన్నారు.



అధికారులూ.. దయ చూపరూ!

ఇటీవల కురిసిన వర్షాలకు తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాల్లో డ్రైనేజీలు, ఓపెన్ నాలాలు జామయ్యాయి. చంద్రబాబునగర్‌లో డ్రైనేజీ ప్రధాన లైన్ పూర్తి నిండిపోయి ఇళ్లల్లోకి మురుగునీరు వచ్చింది. ఇంటి నుంచి బయటకు వెళ్లలేక దుర్వాసనతో ఇంట్లో ఉండలేక నానా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగునీరు బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. -లాలాపేట

రైలులో గంజాయి తరలిస్తున్న వ్యక్తి రిమాండ్

సికింద్రాబాద్: ఒడిస్సా నుంచి మహారాష్ట్రకు గంజాయిని రవాణా చేస్తున్న వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు. జీఆర్‌పీ డీఎస్‌పీ ఎస్‌ఎన్ జావెద్, ఇన్‌స్పెక్టర్ సాయీశ్వర్‌గౌడ్ కథనం ప్రకారం.. రైల్వే పోలీసులు ఆకస్మిక తనిఖీల్లో నిర్వహిస్తుండగా ఒకటో ప్లాట్‌ఫాంపైకి వచ్చిన కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు నిర్వహించారు. బీ-4 బోగీలో అనుమానాస్పదంగా ఉన్న బ్యాగును తెరిచి చూడగా 20 కిలోల గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. సదరు బ్యాగులను అస్సాం రాష్ట్రం బాలుగాన్ నుంచి ముంబయికి సికింద్రాబాద్ మీదుగా తరలిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. రవాణా చేస్తున్న ఒడిస్సా రాష్ట్రం బాలుగాన్‌కు చెందిన మహ్మద్ ఫరీద్ (54) రిమాండ్‌కు తరలించారు. గంజాయిని క్రయ,విక్రయాలు చేసిన ఒడిస్సాకు చెందిన సాహు, ముంబయికి చెందిన పాండా అనే ఇరువురిపై కేసులు నమోదు చేశామన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



మృతి చెందిన వ్యక్తి

రసూల్‌పురా: ఒంటిపై గాయాలతో అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి (35) మృతి చెందిన ఘటన బొల్లారం పీఎస్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తోట ముత్యాలమ్మ దేవాలయం సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. సమీపంలో నిర్మాణంలో ఉన్న ఆసుపత్రి భవన నిర్మాణం కూలి మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

మొబైల్ షాపులో విధ్వంసానికి పాల్పడిన ఆరుగురి రిమాండ్

అమీర్‌పేట: అకారణంగా మొబైల్ షాపులోకి ప్రవేశించి విధ్వంసానికి పాల్పడిన ఆరుగురిని రిమాండ్‌కు తరలించిన ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి వివరాల ప్రకారం.. కూకట్‌పల్లికి చెందిన నికేష్‌కుమార్ ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో ఆర్టీసీ పేరుతో మొబైల్ రిపేరింగ్ షాపును నిర్వహిస్తున్నాడు. ఇతనికి పరిచయం ఉన్న కూకట్‌పల్లికి చెందిన అఖిల్ కూకట్‌పల్లిలో మొబైల్ రిటైల్ షాపు నడిపిస్తున్నాడు. 10 రోజుల క్రితం కొన్ని సెల్‌ఫోన్లు రిపేర్ కోసం ఇచ్చాడు. వీటి విషయమై సోమవారం ఫోన్‌లో ఇరువురు గొడవపడ్డారు. దీంతో కోపోద్రిక్తుడైన అఖిల్ ఆరుగురు యువకులను తీసుకొచ్చి నికేష్‌కుమార్ మొబైల్ షాపులో ప్రవేశించి విధ్వంసానికి పాల్పడి అందులో ఉన్న మరో ఇద్దరు యువకులను చితకబాదారు.నికేష్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అఖిల్‌తో పాటు సాయికుమార్, రాజశేఖర్, నవీన్, ప్రసాద్, రాధాకృష్ణ, నిఖిల్‌రెడ్డిను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నీట్, నూతన జాతీయ విద్యావిధానానికి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలి

లిబర్టీ: నీట్ పరీక్షను రద్దు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్‌లు డిమాండ్‌చేశారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షను, రాష్ట్రాలను సంప్రదించకుండా తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యావిధానాన్ని ద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని, నీట్ పరీక్ష నిర్వహణ రాష్ట్రాలకే అప్పగించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి లేఖ రాయాలన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ దేశంలో నీట్, నెట్ పరీక్ష పేపర్ లీకేజీ కారణంగా 24 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మే 5న జరిగిన పరీక్ష నిర్వహణకు ఒక రోజు ముందే హరియాణా, బీహార్‌లో పేపర్ లీకేజీలు జరిగి జిరాక్స్ సెంటర్లలో పేపర్‌లో దొరికాయని, బీహార్‌లో ఒకే సెంటర్‌లో ఆరుగురు విద్యార్థులకు 720కి 720 మార్కులు సాధించారన్నారు. కేవలం బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే లీకేజీలు, అవకతవకలు జరిగాయని ఆరోపించారు. నీట్ పరీక్ష నిర్వహణ రాష్ట్రాలకు ఇవ్వాలని, మళ్లీ పరీక్ష జరిగే వరకు విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉండాలని కోరారు.

భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులు ప్రారంభం



పైపులైను పనులను ప్రారంభిస్తున్న రామకృష్ణ, ఎమ్మెల్యే శ్రీ గణేష్

రసూల్‌పురా: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తరహా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కంటోన్మెంట్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం లేదని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ ఆరోపించారు. రసూల్‌పురాలో బీరప్ప ఆలయం నుంచి నాగమ్మ ఆలయం వరకు బోర్డు నిధులు రూ. 40 లక్షలతో చేపట్టే భూగర్భ డ్రైనేజీ పైపులైను పనులను మంగళవారం ఆయన ఎమ్మెల్యే శ్రీగణేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి కంటోన్మెంట్ అభివృద్ధికి నిధులు కేటాయించేలా ఎమ్మెల్యే శ్రీగణేష్ కృషి చేయాలని కోరారు. గతంలో రసూల్‌పురాలో నిర్వహించిన బస్తీబాట కార్యక్రమంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు భూగర్భ డ్రైనేజీ పైపులైను పనులకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించినట్లు చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కంటోన్మెంట్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ప్యాట్నీ కాంపౌండ్ వద్ద కబ్జాకు గురైన నాలాను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వార్డు అధ్యక్షుడు మాదరపు అశోక్ కుమార్, మహిళా మోర్చా నాయకురాలు మమత, స్వాతి, కాంగ్రెస్ నాయకులు అన్నానగర్ మురళి, శాంసన్ రాజు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చేస్తా



చెక్కులు అందించిన ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: నియోజకవర్గంలోని అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ పేర్కొన్నారు. గడచిన పదేళ్లుగా రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తూ, అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నియోజకవర్గం పరిధిలోని 155 మంది మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ కార్యక్రమం మంగళవారం సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్ కమ్యూనిటీహాల్లో జరిగింది. గతంలో ఎమ్మెల్యే నేతృత్వంలో జరిగే చెక్కుల పంపిణీ కార్యక్రమాలకు ఆయా విభాగాల అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు మాత్రమే హాజరయ్యేవారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన క్రమంలో తాజాగా ఇలాంటి కార్యక్రమాల్లో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తల సందడి ప్రారంభమైంది. ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ చెక్కులు పంపిణీ చేస్తున్న క్రమంలో కాంగ్రెస్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్‌కుమార్ తన అనుచరులతో మధురానగర్ కమ్యూనిటీహాల్ వచ్చారు. ఇరు పార్టీల నాయకులు పోటాపోటీ నినాదాలు చేసుకోవడంతో కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ కాంగ్రెస్ నేత ఆదం సంతోష్‌తో పాటు, ఆ పార్టీ నాయకులకు ఆహ్వానించి వారిచేత కూడా చెక్కులు పంపిణీ చేయించడంతో చెక్కుల పంపిణీ కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. అనంతరం ఆదం సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ద్వారా నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో తాము పాల్గొంటామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు గోవర్ధన్, అశోక్, కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రాసూరి సునిత, లింగాని ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

బీజేపీ అధ్యక్షుడిగా రాంచందర్ రావుకు అవకాశం ఇవ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ, రాంచందర్ రావు అవకాశం ఇవ్వాలని ఓయూ పూర్వ విద్యార్థులు కోరారు. విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించిన ఆయన రాష్ట్ర నాయకుడు, జంటనగరాల అధ్యక్షుడిగా పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర వర్గాలను సమన్వయం చేసుకునే స్వభావం గల రాంచందర్ రావును బీజేపీ అగ్రనాయకులు గుర్తించి అధ్యక్షుడిగా నియమించాలన్నారు.



కరుణాకర్‌కు డాక్టరేట్



ప్రొ. సులోచనకు పరిశోధన గ్రంథాన్ని అందజేస్తున్న కరుణాకర్

లాలాపేట: వరికోల్‌కు చెందిన దొగ్గల కరుణాకర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఓయూ కామర్స్ విభాగం రిటైర్డు ప్రొఫెసర్ ఎం. సులోచన పర్యవేక్షణలో గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ ఇన్ ఇండియా ఏ కేస్ స్టడీ ఆఫ్ జీహెచ్‌ఎంసీ ఏరియా ఇన్ తెలంగాణ స్టేట్(వస్తు సేవల పన్ను) అనే అంశంపై సమగ్రమైన పరిశోధన గ్రంథాన్ని సమర్పించడంతో డాక్టరేట్ అందజేశారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో జీఎస్టీపై పీహెచ్‌డీ పరిశోధన చేసిందని తానే ప్రథముడని పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలో కామర్స్‌లో పీహెచ్‌డీ పట్టా పొందిన మొదటి మహిళా డాక్టరేట్ ప్రొఫెసర్ సులోచన కావడం గమనార్హం. పలువురు అధ్యాపకులు, తోటి విద్యార్థులకు కరుణాకర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఫిజిక్స్ విభాగం నుంచి..



మసూద్ అహ్మద్ మహముది

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఫిజిక్స్ విభాగం నుంచి మసూద్ అహ్మద్ మహముదికి పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ఓయూ పరిధిలోని సైఫాబాద్ పీజీ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.లక్ష్మణ్ నాయక్ పర్యవేక్షణలో ఫిజికల్ ఆప్టికల్ స్ట్రాక్చరల్ అండ్ బయోయాక్టివ్ స్టడీస్ మిక్స్‌డ్ అల్కాలీ బోరోసిలికట్ కాల్షియం జింక్ గ్లాసెస్ అనే అంశం పై పరిశోధనకు డాక్టరేట్ లభించింది. డాక్టర్ మసూద్ అహ్మద్ మహముది వరంగల్ పట్టణంలోని హన్మకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఫిజిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం చేస్తూ విభాగం హెడ్‌గా కొనసాగుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ మహిళ విశ్వవిద్యాలయంలో పార్టుటైం అధ్యాపక ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్, కామర్స్, జంతుశాస్త్రం, ఫుడ్ సైన్స్, కంప్యూటర్ సైన్స్, బీబీఏ, ఫుడ్ అండ్ న్యూట్రీషియన్, జనటిక్స్, కెమిస్ట్రీ, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ సబ్జెక్టులను బోధించేందుకు ఈ నెల 8 వరకు దరఖాస్తు చేసుకోవచ్చొన్నారు. సర్టిఫికెట్లను నేరుగా అకాడమిక్ డైరెక్టర్ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379